సాక్షి జగిత్యాల

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



బాధ్యతలు స్వీకరణ

జగిత్యాలక్రైం: ఏఆర్ అడిషనల్ ఎస్పీగా భీంరావ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ భాస్కర్‌ను కలిశారు.



గద్దర్‌కు నివాళి

గొల్లపల్లి : ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు మండల కేంద్రంలో ఆయన అభిమానులు శనివారం కొవ్వొత్తులతో ఘన నివాళి అర్పించారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్లు

జగిత్యాల: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్లు దివాకర, బీఎస్ లత అన్నారు. శనివారం కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా నూకపల్లిలోని కేసీఆర్‌నగర్‌లో వారు మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమం ప్రజలందరి బాధ్యత అని అన్నారు. మొక్కలతో మానవ మనుగడ సాధ్యమని వారు తెలిపారు. జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, మొక్కలు నాటి, ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ అనిల్‌బాబు, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, కౌన్సిలర్లు జగదీశ్, ధర్మరాజు, నవీన్, శ్రీనివాస్, మోసిన్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

రాయికల్(జగిత్యాల): జిల్లాలో 18ఏళ్ల వయసు నిండిన యువత ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం కోసం ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ప్రచారం చేపట్టామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి అన్నారు. శనివారం స్థానిక బీఎల్వో కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ ఏడాది అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18ఏళ్ల వయసు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లోనూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తహసీల్దార్ ఖయ్యూం పాల్గొన్నారు.

'ఓట్ల కోసమే విస్తరణ జపం'



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

జగిత్యాలటౌన్: యావర్‌రోడ్డు విస్తరణపై నాయకులకు చిత్తశుద్ధిలేదని, అది కేవలం హామీగానే మిగిలిపోయిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేడ్‌– 3 మున్సిపాలిటీ నుంచి గ్రేడ్‌– 1 మున్సిపాలిటీగా హోదా దక్కించుకున్నా.. రోడ్ల పరిస్థితిలో మార్పు రాలేదని పేర్కొన్నారు. ఏళ్లుగా యావర్‌రోడ్డు విస్తరణ ఎన్నికల నినాదంగానే మిగిలిపోయిందని దుయ్యబట్టారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ లేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ప్రజలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు ఏసీఎస్ రాజు, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, చీటి చంద్రశేఖర్‌రావు, గుర్రం రాము, విద్యా ఠాకూర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా 'మిషన్ భగీరథ'



మాట్లాడుతున్న రవీందర్

జగిత్యాలరూరల్: ఇంటింటా మిషన్ భగీరథ నీరు అందించేలా అందరూ కృషి చేయాలని మిషన్ భగీరథ సర్కిల్ ఎస్ఈ రవీందర్ సూచించారు. లక్ష్మీపూర్ గ్రామంలో శనివారం ఇంటింటికీ మంచినీరు సరఫరాలో హెల్పర్లకు క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. నెలలో మూడుసార్లు ట్యాంకులను శుభ్రం చేయాలని, బ్లీచింగ్ చల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈలు రామారావు, ఆనంద్, జలేందర్‌రెడ్డి, సర్పంచ్ చెరుకు జాన్, ఏఈలు వసీం, రాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

హరిత తెలంగాణ కోసం..

కోరుట్ల/కథలాపూర్/జగిత్యాలరూరల్/జగిత్యాలక్రైం: కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం విరివిగా మొక్కలు నాటారు. కోరుట్ల, కథలాపూర్‌లో కలెక్టర్ యాస్మిన్ బాషా మొక్కలు నాటారు. కోటి వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని కోరారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మొక్కలు నాటారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ భాస్కర్ మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కల్ని నాటడమే కాదు.. వాటిని సంరక్షించాలని కోరారు.



కోరుట్లలో మొక్క నాటుతున్న కలెక్టర్



మొక్కలు నాటుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎస్పీ భాస్కర్, పోలీసు అధికారులు

పట్టణాల్లోనే పరేషాన్

- 2018 కోరుట్ల అసెంబ్లీ ఎన్నికలు : మల్లాపూర్ మండలం ఓబులాపూర్ తండాలోని మొత్తం ఓట్లు 277.. ఇందులో పోలైనవి 255. తండాలో పోలింగ్ శాతం 92 కావడం విశేషం.
- ఇవే ఎన్నికల్లో కోరుట్ల అసెంబ్లీ పరిధిలోని మెట్‌పల్లి పట్టణం : 199 నంబరు పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం 1,014 ఓట్లు ఉండగా, కేవలం 581 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. పోలింగ్ శాతం 57 శాతమే నమోదు కావడం అధికారులను ఆందోళన కలిగించింది.



కోరుట్లలో పోలింగ్ శాతం పెంపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

- తక్కువ పోలింగ్ శాతం నమోదు
- క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టి సారించాల్సిందే..

కోరుట్ల: ప్రతీ ఎన్నికలోనూ పల్లెల్లో అధికశాతం, పట్టణాల్లో తక్కువగా పోలింగ్ నమోదు కావడం పరిపాటిగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లోని చాలా పోలింగ్ కేంద్రాల్లో 55 – 75 శాతం లోపే పోలింగ్ నమోదు కావడం గమనార్హం.

ఎవరు ఆసక్తి చూపుతున్నారు?

నిరక్షరాస్యులు.. పల్లెల్లో ఉండే వారు ఓటు వేయడంపై ఆసక్తి చూపడం లేదని అనుకుంటే.. మనం పప్పులో కాలేసినట్లే. నిజానికి పల్లెలు, తండాల్లో ఉండే గ్రామీణులే ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. ఇదివరకు జరిగిన ప్రతీ ఎన్నికలోనూ పల్లెలు.. తండాల్లోని ఓటర్లు ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకున్నారు.

తేడా 441 మాత్రమే..

'మన ఒక్కరం ఓటు వేయకుంటే ఏమవుతుందిలే'.. అనే నిరాసక్తత పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే.. ధర్మపురి ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కేవలం 441 ఓట్ల తేడాతోనే ప్రత్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై గెలుపొందారు.

- ఇలాంటి ఫలితాలను పరిశీలిస్తే.. చిన్నపాటి ఓట్ల తేడా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపి అభ్యర్థుల గెలుపోటములను ఎలా తారుమారు చేస్తుందన్న అంశం తేటతెల్లమవుతోందని పరిశీలకులు అంటున్నారు.
- అక్షరాస్యులు, విద్యాధికులు, ఉద్యోగాలు చేసేవారు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదు కావడం కలవరపరుస్తోంది.
- ఉద్యోగాలు, వ్యాపారాలు.. ఇతరత్రా పనుల ఒత్తిడితో పట్టణవాసులు ఓటింగ్‌లో పాల్గొనడంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
- ఇంటిపెద్ద బిజీగా ఉండి ఓటింగ్‌పై ఆసక్తి చూపకపోవడంతో మిగతా కుటుంబసభ్యులు ఓటింగ్‌లో పాల్గొనడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
- గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ శాతం 75 శాతం లోపు ఉండటం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది.

క్షేత్రస్థాయిలో దృష్టి సారించాల్సిందే..

నెల రోజులుగా పోలింగ్ శాతం పెంపు కోసం కసరత్తు చేస్తున్న అధికారులు.. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెంపుపై దృష్టి సారించడం ఎంతైనా అవసరమని అంటున్నారు. పట్టణాల్లో ఓటింగ్ శాతం తగ్గడానికి కారణాలు ఏమిటన్న అంశంపై పూర్తి స్థాయిలో విశ్లేషించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ఇప్పటికే పట్టణాల్లో ఉద్యోగ విరమణ పొందిన సంఘాలు, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారితో రూపొందిన సంస్థలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నాయి. కొన్ని వ్యాపార సముదాయాల్లో పెద్ద సంఖ్యలో పనుల్లో ఉన్నవారికి ఓటింగ్‌లో పాల్గొనడం కోసం ఆయా యాజమాన్యాలతో మాట్లాడి సమయం ఇప్పించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణాల్లోని కార్మిక సంఘాలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. యువతలోనూ ఓటింగ్‌పై ఆసక్తి పెంపొందేలా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది.

పోలింగ్ శాతం పెంపుపై దృష్టి



గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ 5–15 శాతం తక్కువగా నమోదు అవుతోంది. పట్టణాల్లో పోలింగ్ శాతం పెంపునకు రిటైర్డ్, ప్రైవేట్ ఉద్యోగ, యువజన సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాం. అన్నివర్గాల్లో పోలింగ్‌పై చైతన్యం తెస్తున్నాం.

– రాజేశ్వర్, ఆర్డీవో, కోరుట్ల

కారుణ్య నియామకాల్లో అవినీతి లేదు

- పారదర్శకంగా పోస్టింగ్‌లు ఇచ్చాం
- కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు
- జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత



జగిత్యాల: జిల్లాలో రెండురోజుల క్రితం చేపట్టిన కారుణ్య నియామకాల్లో ఎలాంటి అవినీతి జరగలేదని, ప్రతీఒక్కరికి పారదర్శకంగానే పోస్టింగ్‌లు ఇచ్చామని, కొందరు గిట్టనివారు బురదజల్లే ఆరోపణలు చేస్తున్నారని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం జెడ్పీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 31 మందికి పారదర్శకంగానే పోస్టింగ్‌లు ఇచ్చామన్నారు. ఇందులో అవినీతి, డబ్బుల డిమాండ్ లేదని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రతీచోట పోస్టింగ్‌లు ఇచ్చామని వివరించారు. ప్రజాప్రతినిధుల సన్నిహితులు డబ్బులు డిమాండ్ చేసినట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. తాము నిజాయితీగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయాలనే భావనతోనే రాజకీయాల్లోకి వచ్చానని, జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నానని, ప్రతీ ఒక్కరికి న్యాయం చేస్తున్నానని చెప్పారు. సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో ఎమ్మెల్సీ కవిత, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, రమేశ్‌బాబు, రవిశంకర్ అండదండలతోపాటు, జెడ్పీటీసీల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నానని తెలిపారు. జెడ్పీసీఈవో రామానుజాచార్య, ఓఎస్డీ అశోక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల భిక్షాటన

జగిత్యాలటౌన్: తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ కోరారు. సమ్మెలో భాగంగా శనివారం భిక్షాటనతో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్ చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో మధురిమ మాట్లాడుతూ తమ యూనియన్ నాయకులతో రెండు దఫాలుగా చర్చలు జరిపిన ప్రభుత్వం.. రెగ్యులరైజేషన్ తప్ప మిగతా సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే, రెగ్యులరైజేషన్ తప్ప మరో ఆప్షన్ అవసరం లేదని తిరస్కరించామని తెలిపారు. మిగతా శాఖల్లో మాదిరిగానే తమ గోడు పట్టించుకోవాలని కోరారు. తెలంగాణ ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న మేము మీ బిడ్డలం కాదా అని ప్రశ్నించారు. సెప్టెంబర్ 16వరకు సమ్మె కొనసాగించేందుకు యూనియన్లు నిర్ణయించాయని, ఈలోగా ప్రభుత్వం దిగి రాకుంటే ఆందోళనను మరింతి ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గూడూరి జయప్రద, మమత, సుప్రియ, నీరజ, పద్మ, రాజ మని, మేరి, ఎలిజబెత్, శిరీష, ప్రశాంతి, శైలజ, సునీత, అహల్య, షాలిమున్నీసా, శిరీష పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలు.

మహిళల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సంక్షేమాధికారి నరేశ్

జగిత్యాల: మహిళలు హక్కుల గురించి తెలుసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ సూచించారు. శనివారం స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో మహిళల ఆర్థికాభివృద్ధి, స్కిల్‌డెవలప్‌మెంట్ మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు ప్రతీ రంగంలో రాణించాలన్నారు. అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నంబర్లు అందుబాటులోకి తీసుకొచ్చామని, వాటి ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఎలక్షన్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ అశ్విని, హేమశ్రీ, గౌతమి పాల్గొన్నారు.

నాచుపల్లి జేఎన్టీయూలో ఎన్‌బీఏ బృందం తనిఖీలు

కొండగట్టు(చొప్పదండి): నాచుపల్లి జేఎన్టీయూలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) బృందం శనివారం తనిఖీలు చేసింది. కళాశాలలోని సౌకర్యాలు, సర్టిఫికెట్లు, సిబ్బంది వివరాలు, ప్లేస్‌మెంట్లపై ఆరా తీసింది. గతంలో మెకానికల్, సీఎస్సీ, ఈఈఈ డిపార్ట్‌మెంట్లకు మూడు సంవత్సరాలు ఎన్‌బీఏ గుర్తింపు ఉండగా వాటి గడువు పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, హైదరాబాద్ నుంచి స్పెషల్ టీం వచ్చి తనిఖీలు చేసినట్లు హెచ్‌వోడీలు తెలిపారు.

సండే స్పెషల్



అనుబంధాల తీజ్

ఉమ్మడి జిల్లాలోని గిరిజన తండాల్లో తీజ్ సందడి నెలకొంది. తరతరాలుగా వస్తున్న ఈ సంస్కృతిని అడవిబిడ్డలు సంప్రదాయ బద్ధంగా జరుపుకుంటారు. ఈ పండుగ బతుకమ్మను పోలి ఉంటుంది. తీజ్(గోధుమనారు)ను ఎనిమిది రోజుల పాటు పూజించి తొమ్మిదోరోజు నిమజ్జనం చేస్తారు. ఏటా శ్రావణమాసంలో జరిగే ఈ సంబరాలు అంబరాన్నంటుతాయి. మంచి వరుడు దొరకాలని పెళ్లీడుకొచ్చిన యువతులు తొమ్మిది రోజులపాటు పూజలు చేయడం ఈ వేడుక ప్రత్యేకత.

– సాక్షి, కరీంనగర్ డెస్క్



సంస్కృతిని కాపాడుకుందాం

మాకు ప్రత్యేకమైన భాష, ఆచారం, సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా మా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటున్నాం. భవిష్యత్‌లో కూడా వాటిని కాపాడుకుంటాం. తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలి. రాబోయే కాలంలో తీజ్ పండుగను ప్రభుత్వం గుర్తిస్తుందని భావిస్తున్నాం.

– అజ్మీర శృతి, జగదాంబ తండా, గంభీరావుపేట

- తండాల్లో తీజ్ సంబురం
- ముస్తాబైన గిరిజన గూడేలు
- శ్రావణమాసంలోనే వేడుకలు
- తొమ్మిది రోజులు సందడి
- గోధుమనారుకు పెళ్లికాని యువతుల నిష్టతో పూజలు

తొమ్మిది రోజులు.. కఠిన నియమాలు

పెళ్లికాని యువతులు వెదురుబుట్టలో పుట్టమట్టిని తెచ్చి అందులో నవధాన్యాలు విత్తుతారు. తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలు ఉంటూ నిత్యం ఉదయం, సాయంత్రం వెదురుబుట్టలో విత్తిన గోధుమనారుకు నీళ్లు పోస్తూ పూజలు చేస్తారు. ఏడో రోజు ఢమోళి అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతీ ఇంట్లో బియ్యం పిండితో చుర్మో రొట్టెలు చేసి వాటిని బెల్లంతో కలిపి ముద్దలు చేస్తారు. తీజ్ ఉన్న ఇంటి ఆవరణలో సేవాబాయి, మెరామల పూజలు నిర్వహిస్తారు. మెరామల పూజ చేసే ఇంటి ముందు జొన్నలు నింపిన గోనె సంచులు ఉంచి దానిపై ఒక చిన్న బిందెలో నీళ్లు పోసి వేప మండలు వేస్తారు. తీజ్ నేపథ్యంలో తొమ్మిది రోజులు అమ్మాయి కఠిన నియమాలు పాటిస్తారు. ఉప్పు, కారం లేని భోజనం తినాలి. తండా నుంచి బయటకు వెళ్లకూడదు. నేలపై పెట్టకుండా బావి నుంచి నీటిని బిందెలో తెచ్చి పందిరిపై పోస్తారు.

యువతుల నృత్యాలు.. పాటలు

తీజ్ తొమ్మిది రోజుల పండుగ. ఆటపాటలు, యువతుల నృత్యాలతో గిరిజన గూడేలలో పండుగ వాతావరణం నెలకొంటుంది. గోధుమ నారును ఎనిమిది రోజులపాటు పూజించి తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారు. పెళ్లి కాని ఆడపిల్లలే ఈ వేడుక నిర్వహిస్తారు.

ఏర్పాట్ల బాధ్యత వారిదే..

వరి నాట్లు వేయడం పూర్తి కాగానే యువతులు తండా పెద్ద అనుమతి తీసుకొని ఏర్పాట్లు చేస్తుంటారు. ఇంటింటికెళ్లి విరాళాలు సేకరించి, అంగడికెళ్లి గోధుమలు, శనగలు, ఇతర సామగ్రి తెస్తారు. గోధుమలు నానబెట్టడానికి దుస్సేరు తీగలతో బుట్టలను అల్లి, పుట్ట మట్టిని తెచ్చి అందులో మేక ఎరువు కలుపుతారు. మెదట తండా నాయకుడి చేత ఎరువు కలిపి మట్టిని పోయించి గోధుమలను చల్లిస్తారు. శ్రీ సంత్‌సేవాలాల్ మహారాజ్, సీతా మేరమా మాతతోపాటు తిరుపతి బాలాజీ, హాథీరాం బాలాజీ, వేములవాడ రాజన్న, తుల్జా భవానీలను కొలుస్తారు.

ఉమ్మడి జిల్లాలో

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గిరిజనులు అధికంగా ఉన్న వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, ముస్తాబాద్, మండలాలతో పాటు కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలం, కరీంనగర్ సిటీ, చింతకుంటశాంతినగర్, జగిత్యాల జిల్లా రాయికల్, సారంగాపూర్‌లో తీజ్ వేడుకలు నిర్వహిస్తారు.

అసలేరు కార్తెలో..

శ్రావణమాసం అసలేరు(అశ్లేష)కార్తె ప్రారంభం కాగానే తండాల్లో తీజ్ వేడుకలు మొదలవుతాయి. తండా పెద్ద మనిషి ఇంటి ఎదుట పందిరి ఏర్పాటు చేసి, దానిపై గోధుమబుట్టలను పెడతారు. ఈ గోధుమ బుట్టలపై యువతులు నిత్యం ఉపవాసంతో నీరు పోస్తుంటారు. పండుగ ముగిసే వరకూ ఒక్కపూటే భోజనం చేస్తారు.

గోధుమ నారుతో ఊరేగింపు

తీజ్‌లో ప్రధాన ఘట్టం చివరి రోజు పందిరిపై ఉంచిన గోధుమనారు బుట్టలను కిందికి దింపి వాటి చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేస్తారు. అనంతరం గోధుమనారు బుట్టలను నెత్తిపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని వాగులలో నిమజ్జనం చేస్తారు. శ్రావణమాసం ప్రారంభంలో మొదలు పెట్టిన తీజ్ ఉత్సవాలు చివరి వారంలోపు ముగుస్తాయి.

తీజ్ అంటే ఆనందం



తీజ్ అంటే ఒక ప్రత్యేకమైన పండుగ. దీన్ని మేము ఆనందోత్సాహాలతో జరుపుకుంటాం. తీజ్ బుట్టలను తొమ్మిదవ రోజున మేము నిమజ్జనానికి డప్పు చప్పుళ్ల మధ్య తీసుకెళ్తాం. గోర్ ప్రజల బతుకమ్మ తీజ్ కాబట్టి మహిళా ట్రైబల్ గురుకులాల్లో ప్రత్యేకమైన సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– మూడ్ మౌనిక, జగదాంబ తండా, గంభీరావుపేట



తొమ్మిది రోజులు ఆటపాటలతో..

తీజ్ పండుగను తొమ్మిది రోజుల పాటు ఆనందోత్సాహాలతో, ఆటపాటలతో నిర్వహించుకుంటాం. తీజ్ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. బతుకమ్మను పూలతో అలంకరించినట్లే తీజ్‌లో నవధాన్యాలు, గోధుమ మొలకలను పూజించడం ఆనవాయితీ. తీజ్ దేవత పంటలను, ప్రకృతిని కాపాడుతుందని మా ప్రగాఢ విశ్వాసం.

– అజ్మీర సాహితి, జగదాంబతండా, గంభీరావుపేట



గోధుమనారుతో యువతులు

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

బుగ్గారం(ధర్మపురి): జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పోగుల ప్రవీణ్(20) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నయం కాలేదు. తరచూ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో వారికి భారం కాకూడదనుకున్నాడు. శనివారం తన తల్లి కూలీ పనులకు వెళ్లగా.. తండ్రి వృత్తి పనికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని ఈ సమయంలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన తండ్రి.. ఇంటి తలుపులు వేసి ఉండడం చూసి కుమారుడిని పిలిచాడు. ఎంతకూ తలుపులు తీయలేదు. దీంతో ఇంటి వెనుకభాగంలోని తలుపులను పగులగొట్టి లోనికి వెళ్లగా ప్రవీణ్ ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. అప్పటికే తను మృతి చెందాడు. తండ్రి అంజన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మార్చురీలో భద్రపరిచిన మృతదేహం

మల్యాల(చొప్పదండి): రాజారం గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా పడి ఉన్నాడని స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి, బాధితుడిని 108 వాహనంలో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్సై అశోక్ అన్నారు. మృతుడి వయసు సుమారు 55ఏళ్లు ఉంటుందని, శరీరంపై గులాబీ రంగు టీషర్టు ఉందని, వివరాలు తెలిసిన వారు మల్యాల పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. మృతదేహాన్ని జగిత్యాల మార్చురీలో భద్రపరిచామని ఎస్సై తెలిపారు.

రాయికల్(జగిత్యాల): జగన్నాథపూర్ గ్రామానికి చెందిన కుర్ర రాజం (55) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. రాజం మద్యానికి బానిస కాగా, జీవితంపై విరక్తి చెంది ఈనెల 22న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు ఎస్సై వివరించారు.

కొండగట్టు చోరీ కేసులో ఎనిమిదో వ్యక్తి అరెస్ట్

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఇటీవల జరిగిన చోరీకి కేసులో పరారీలో ఉన్న మూడో నిందితుడి(ఎనిమిదో వ్యక్తి)ని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ శనివారం తెలిపారు. కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ఈ ఏడాది ఫిబ్రవరి 24న అర్ధరాత్రి జరిగిన చోరీ కేసులో ఎనిమిది మందిపై కేసు నమోదైందని పేర్కొన్నారు. ఇందులో ఇప్పటికే ఏడుగురిని పట్టుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. పరారీలో ఉన్న మూడో నిందితుడు కర్ణాటకలోని బీదర్‌కు చెందిన విక్రమ్‌ను కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని ఎస్సై వివరించారు.

పెరుగుతున్న చిన్నకమతాలు

- ఇబ్బడి ముబ్బడిగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు
- రెండేళ్లలో కొత్తగా 20 వేల మంది కొత్త పట్టాదారులు


వ్యవసాయ భూమి దున్నుతున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతుబీమా పథకం అమలుతో జిల్లాలో ఏటా సన్న, చిన్నకారు రైతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. రైతుబీమా ద్వారా అనారోగ్యం, యాక్సిడెంట్.. ఇలా ఏ రకంగా మరణించినా.. మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం అందుతోంది. దీంతో ఈ పథకానికి రైతుల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఆగస్టు వచ్చిందంటే.. ఆ ఏడాదిలో కొత్తగా బీమా కింద వచ్చే రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో ఆప్‌లోడ్ చేయడంలో వ్యవసాయాధికారులు నిమగ్నమవుతున్నారు.

జిల్లాలో పట్టాదారు రైతులు..

- జిల్లాలో 2,27,268 మంది పట్టాదారు రైతులు ఉన్నారు.
- వెల్గటూర్ మండలంలో అత్యధికంగా 17,601 మంది ఉండగా, అత్యల్పంగా జగిత్యాల అర్బన్ మండలంలో 5,384 మంది ఉన్నారు.
- మల్లాపూర్‌లో 14,976మంది, బీర్‌పూర్‌లో 8135 మంది, మెట్‌పల్లిలో 16,437 మంది, బుగ్గారంలో 7,185 మంది, సారంగాపూర్‌లో 7,340 మంది, కథలాపూర్‌లో 13,001 మంది, జగిత్యాల రూరల్‌లో 16,611 మంది, కోరుట్లలో 13,169మంది, రాయికల్‌లో 14,740మంది, పెగడపల్లిలో 13,573 మంది, మల్యాలలో 11,141మంది, మేడిపల్లిలో 14,136మంది, కొడిమ్యాలలో 11,736 మంది, ధర్మపురిలో 15,734మంది, గొల్లపల్లిలో 16,056 మంది, ఇబ్రహీంపట్నంలో 10,313 మంది పట్టాదారు రైతులు ఉన్నారు.

ఏటా పెరుగుతున్న రైతుల సంఖ్య..

2021 సంవత్సరం వరకు రైతుబీమా కింద 1,31,216 మంది రైతులు అర్హత పొందగా, 2023 నాటికి అర్హుల సంఖ్య 1,51,371కు చేరింది. అంటే, రెండేళ్లలో అదనంగా 20,155 మంది రైతులు ఈ పథకంలో చేరారు. అలాగే, 75,897 మంది రైతులు 18 ఏళ్ల కంటే తక్కువ ఉండటం, 59 ఏళ్ల కంటే ఎక్కువ ఉండే నిబంధనలతో రైతుబీమా పథకంలోకి రాలేదు.

పెరుగుతున్న గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌లు..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు వ్యవసాయ భూములపై రైతులు పెద్దగా దృష్టి పెట్టలేదు. తండ్రి లేదా తల్లి చనిపోయిన తర్వాత వారసత్వంగా భూములు తమ కుమారులు, కూమార్తెల పేరిట వచ్చేవి. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ భూములు ఉన్న పట్టా రైతులకు రైతుబీమాతోపాటు రైతుబంధు వర్తింపజేయడంతో ఒక్కసారిగా వ్యవసాయ భూములకు డిమాండ్ ఏర్పడింది. దీంతో రైతుబంధు డబ్బులు ఇవ్వాలని కుమారులు పట్టుబడుతున్నారు. దీనికి తోడు, రూ.5 లక్షల బీమా వర్తిస్తుండడంతో తమకు ఎలాగైనా భూమి పట్టా చేయాలని సంతానం పంచాయితీలూ పెడుతున్నారు. దీంతో, పట్టాదారులు కొంత తమ పేరిట ఉంచుకుని, మరికొంత సంతానం పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

చిన్న కమతాలు అధికం..

జిల్లాలో చిన్న, సన్నకారు రైతుల సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు పదెకరాలు ఉన్న ఓ రైతు, కేవలం రెండు ఎకరాలు తన పేరిట ఉంచుకుని, మిగతా 8 ఎకరాలను ఇద్దరు కుమారులకు పట్టా చేస్తున్నారు. ఇందుకోసం, తండ్రులు గిఫ్ట్ డీడ్ చేస్తుండటంతో చిన్నకమతాల సంఖ్య పెరుగుతోంది. కొందరైతే గతంలో ఇంటి యజమాని పేరిట భూమి ఉంటే, ఇప్పుడు సగం రైతు కుటుంబాల్లో యజమాని భార్య పేరిట పట్టాలు చేస్తున్నారు.

బీమా కోసం రిజిస్ట్రేషన్



నాకు ఆరు ఎకరాలు ఉంది. నేను కొంత ఉంచుకుని, మిగతా భూమిని నా ఇద్దరు కొడుకుల పేరిట రిజిస్ట్రేషన్ చేశా. ఇద్దరు కొడుకులు రైతుబీమాకి అర్హత సాధించారు.

– గడ్డం గంగారెడ్డి, చల్‌గల్, జగిత్యాల రూరల్

సంఖ్య పెరుగుతోంది



రైతుబీమా పథకం అమలులోకి వచ్చిన ప్పట్నుంచి జిల్లాలో పట్టాదారు రైతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గత రెండేళ్లలో సుమారు 20 వేల మంది కొత్త పట్టాదారులు వచ్చారు. దీంతో, చిన్న కమతాల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

ఏటీఎంలలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్


అరెస్టు చూపిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలకేంద్రంలోని రెండు ఏటీఎంలలో దొంగతనానికి యత్నించిన వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, మేడిపెల్లి ఎస్సై చిరంజీవి శనివారం విలేకరులకు తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన సయ్యద్ వాజీర్ ఈనెల 22న రాత్రి మేడిపెల్లి మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ఏటీఎంలలోకి చొరబడి వాటిని ధ్వంసం చేసి అందులోని డబ్బులు తీసే ప్రయత్నం చేశారు. మిషన్‌లో నుంచి డబ్బులు బయటకు రాకపోవడంతో వాజీర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు నిందితుడి గుర్తించి ఆరా తీసి పట్టుకున్నారు. వివరాలు సేకరించి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వివరించారు.

మొక్కలు నాటే బాధ్యత తీసుకోవాలి

- డీఎస్పీ రవీందర్ రెడ్డి


మొక్క నాటి నీళ్లు పోస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కోరుట్లరూరల్: మొక్కలు నాటడం ప్రతీఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి కోరారు. కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం వెంకటాపూర్ గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డీఎస్పీ మాట్లాడుతూ పర్యావరణంలో సమతుల్యత కోసం మొక్కలు తప్పనిసరన్నారు. ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. మాదాపూర్ గ్రామంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలు నాటారు. అన్ని గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐ కిరణ్ కుమార్, డీఎల్‌పీవో శంకర్, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్ తోట శారద, ఆలయ కమిటీ చైర్మన్ కటుకం రాజేశ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో నీరజ, సింగిల్‌విండో డైరెక్టర్లు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం

కథలాపూర్(వేములవాడ): తుర్తి, సిరికొండ గ్రామాల్లో వేర్వేరుగా జరిగిన ఆన్‌లైన్ మోసాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి బంపర్ డ్రాలో కారు గెలుచుకున్నారని.. జీఎస్టీ డబ్బులు మాత్రమే చెల్లిస్తే కారు తీసుకోవచ్చని పోస్టులో ఉత్తరం వచ్చింది. ఈ మేరకు సదరు వ్యక్తి రూ. 30 వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. తర్వాత మోసపోయానని గుర్తించి 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో గ్రామంలో తెలిసిన వ్యక్తి ఫోన్ తీసుకొని ఫోన్ పే ద్వారా డబ్బులు ఇతరులకు పంపించి మోసం చేశారని బాధితుడు పోలీసులను ఆశ్రయింగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులతో ఆన్‌లైన్‌లో డబ్బులు బదిలీ చేసుకోవద్దని ఎస్సై కిరణ్‌కుమార్ సూచించారు.

గల్ఫ్ ఏజెంట్‌పై కేసు

కథలాపూర్(వేములవాడ): వీసా కోసం డబ్బులు తీసుకొని మోసం చేసిన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన గల్ఫ్ ఏజెంట్ షేక్ బషీర్‌పై కేసు నమోదు చేసినట్లు కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామానికి చెందిన ఉత్కం శ్రీనివాస్‌తోపాటు అదేగ్రామానికి చెందిన 10 మంది వద్ద కువైట్ దేశం పంపిస్తామని గతేడాది అక్టోబర్‌లో గల్ఫ్ ఏజెంట్ డబ్బులు తీసుకున్నారు. వీరినుంచి రూ.3 లక్షలు వసూలు చేశారు. వీసా ఇవ్వకపోగా.. డబ్బులు తీసుకొని పరారు కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఉత్కం శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు గల్ఫ్ ఏజెంట్ షేక్ బషీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ వివరించారు.

వేధించిన భర్త, అత్త, మామపై..

జగిత్యాలక్రైం: స్థానిక అరవింద్‌నగర్ ప్రాంతానికి చెందిన గట్ల మాధవిని శారీరకంగా, మానసికంగా వేధించిన ఆమె భర్త గట్ల ప్రణయ్, మామ భూమయ్య, అత్త లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం శనివారం తెలిపారు. మోచీబజార్ ప్రాంతానికి చెందిన వెన్న గంగాధర్ చిన్న కుమార్తె మాధవిని అరవింద్‌నగర్‌కు చెందిన గట్ల ప్రణయ్‌కి ఇచ్చి నాలుగు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి దత్తశ్రీ(3) కుమార్తె ఉంది. అయితే, కొద్దికాలంగా మాధవిని భర్త, మామ, అత్త కలిసి తీవ్రంగా వేధిస్తున్నారు. దీంతో ఈనెల 25న సాయంత్రం 4 గంటలకు ఆమె ఆత్మహత్యకు యత్నించింది. ఆవేదన చెందిన మాధవి తండ్రి గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఓటరు నమోదుకు యువత కదిలిరావాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా


మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ఓటరు నమోదుకు యువత కదిలిరావాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, యువ ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అధికారులు పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన చేయాలని చెప్పారు. ప్రతీ నియోజకవర్గ పరిధిలో స్వీప్ కార్యాచరణపై ప్రణాళిక తయారుచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఆర్డీవోలు పాల్గొన్నారు.

నృసింహునికి పూజలు



ధర్మపురి : ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మొక్కు చెల్లించిన కమెడియన్ సదయ్య..

యూట్యూబ్ కమెడియన్ స దయ్య దంపతులు శనివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.

విద్యుత్ శాఖ కార్యాలయాల్లో 'కోటి వృక్షార్చన'


మొక్క నాటుతున్న ఎస్ఈ సత్యనారాయణ

జగిత్యాలజోన్: జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంతోపాటు, జిల్లాలోని 35 విద్యుత్ సెక్షన్ల పరిధి కార్యాలయాలు, సబ్‌స్టేషన్లలో శనివారం కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లాలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ సత్యనారాయణ మొక్కలు నాటారు.

'3.85 లక్షల మొక్కలు నాటాం'

జగిత్యాలరూరల్: వృక్షార్చన కార్యక్రమం ద్వారా జిల్లాలో శనివారం 3.85 లక్షల మొక్కలు నాటామని జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమంతో పాటు, వృక్షార్చన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటామని చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- డీఎస్పీ వెంకటస్వామి


కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు


పోలీసు అధికారులకు సెల్యూట్ చేస్తున్న జాగిలాలు

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి అన్నారు. ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని చిలుకవాడలో శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించామన్నారు. ప్రజల రక్షణ, ప్రజల భద్రత కోసం, వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అపరిచితులు, కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, పేలుడు పదార్థాలను కనుక్కునేందుకు జాగిలాలతో విస్తృత తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. ధ్రువీకరణ పత్రాలు లేని, నంబరు ప్లేట్లు లేని 40 వాహనాలు సీజ్ చేశామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నటేశ్, ఎస్సైలు అబ్దుల్ రహీం, సతీశ్, సదాకర్, ఏఎస్సై వేణురావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసమే..

కోరుట్ల: ప్రజల భద్రత కోసమే కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. నక్కలగుట్ట ప్రాంతంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 79 మోటార్ సైకిళ్లు, 2 ఆటోలు, 2 ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. 20 లీటర్ల గుడుంబా పట్టుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడారు. కొత్త వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇచ్చేక్రమంలో వారి ఆధార్ లేదా చిరునామా గుర్తింపు తీసుకోవాలన్నారు. సీఐ ప్రవీణకుమార్, ఎస్ఐ కిరణ్‌కుమార్, మేడిపెల్లి, కథలాపూర్, మల్లాపూర్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్ నమస్తే.. విధుల్లో చేరా..

చిలుకవాడలో పోలీసులు చేపట్టిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. వీరంతా ఇంటింటా తనిఖీలు చేశారు. అక్కడకు చేరుకున్న డాగ్ స్క్వాడ్, బాంబ్ ఎక్స్‌క్లూజీవ్, ఆరో, నార్కోటిక్‌లో శిక్షణ పొందిన జాకీ(జాగిలాలు) తొలుత పోలీసు ఉన్నతాధికారులకు సెల్యూట్ చేశాయి. ఆ తర్వాత తమ విధులు నిర్వర్తించాయి. దీంతో అక్కడున్న వారంతా వారి పనితనాన్ని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు.

భూమిలోకి ప్రవేశించిన మహిళలు


మోతెలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

- చీరలతో గుడిసెలు వేసేందుకు యత్నం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్, మోతె, జాబితాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకోవాలని సీపీఐఎం నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం మోతె శివారులోని సర్వేనంబరు 72లో మహిళలు ప్రవేశించారు. చెట్లు నరికి జెండాలు పాతారు. చీరలతో గుడిసెలు వేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అది ప్రైవేట్ భూమి అని అభ్యంతరం చెప్పడంతో మహిళలు వెనుదిరిగారు. అనంతరం జగిత్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. నిరుపేదలకు ప్రభుత్వ భూమికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కాగా, శుక్రవారం కూడా తిమ్మాపూర్, మోతె, జాబితాపూర్ శివారులోని ప్రభుత్వ భూములను వారు చదును చేసి గుడిసెలు వేసేందుకు ప్రయత్నించగా అధికారులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు.

ఆందోళనకారులపై కేసు..

జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామ శివారులోని సర్వేనంబరు 72లో తాటిపాముల సత్యనారాయణకు చెందిన 6.10 ఎకరాల స్థలం ఉందని, సీపీఐఎం నాయకులు మహిళలను రెచ్చగొట్టడంతో వారు చెట్లు కొట్టేయడంతోపాటు, భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించారని తాటిపాముల సత్యనారాయణ శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల్ల బాలకృష్ణ, నాయకులు గుగులోతు తిరుపతినాయక్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, రమేశ్‌తోపాటు, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన డీవైఎస్‌వో



జగిత్యాలజోన్: జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతను జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి రవి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో క్రీడల అభివృద్ధికి ఎంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని క్రీడాకారులను ఉన్నతంగా తయారుచేసి రాష్ట్ర, జాతీయస్థాయికి తీసుకెళ్లాలని దావ వసంత కోరారు.

కాకతీయ కాలువలో హెడ్ కానిస్టేబుల్ గల్లంతు?

- నీళ్లు నిలిపివేసినా దొరకని ఆచూకీ
- అయోమయంలో కుటుంబ సభ్యులు


మల్లయ్య(ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): ఎల్ఎండీ రిజర్వాయ ర్‌ను ఆనుకొని ఉన్న కాకతీయ కాలువలో ఏఆర్ హె డ్ కానిస్టేబుల్ గల్లంతయ్యాడు. తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి కథనం మేరకు.. తిమ్మాపూర్ మండ ల కేంద్రానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ దుండే మల్లయ్య (50) శుక్రవారం సాయంత్రం కాకతీయ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దకు వెళ్లాడు. తినుబండారం తిని కాలువలో చేతులు కడుక్కునేందుకు మెట్ల నుంచి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. స్థానికులు గమనించి అత డ్ని కాపాడేందుకు తాడు వేసినా స మయానికి అందుకోకపోవడంతో పాటు కాలువలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కొట్టుకుపోయాడు. మల్ల య్య కరీంనగర్ భగత్‌నగర్‌లో నివా సం ఉంటూ హెడ్ కానిస్టేబుల్‌గా పెద్దపల్లి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో మంథని ఎమ్మె ల్యే శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి ఈటల రాజేందర్, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ వద్ద గన్‌మెన్‌గా పని చేశాడు.

ఈత వచ్చినా..

దుండే మల్లయ్యకు 50 ఏళ్ల వయసు ఉన్నా యువకుడిలా యాక్టీవ్‌గా ఉండేవాడు. మృదు స్వభావి, మంచికి మారుపేరుగా ఉండడంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టుబట్టి అతడ్ని గన్‌మెన్‌గా పెట్టుకున్నారు. అతడికి ఈత వచ్చినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. గల్లంతు అయ్యే సమయంలో మత్స్యకారులు తాళ్లు విసిరివేసే క్రమంలో మల్లయ్య కొద్దిదూరం ఈత కొట్టినట్లు సమాచారం. ఈదుకుంటూ కట్టవైపు రాకపోవడంతో అక్కడున్న వారు ఆందోళనకు గురయ్యారు. కొద్ది దూరం ఈదుకుంటూ వెళుతూ మునిగిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కెనాల్‌లో నీటిని నిలిపివేసినా మల్లయ్య ఆచూకీ దొరక్కపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనపై మల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన సింగరేణి కార్మికుడు మృతి

గోదావరిఖని(రామగుండం): స్థానిక తిలక్‌నగర్‌లో నివాసముంటూ జీడీకే–1వ గనిలో పనిచేస్తున్న సింగరేణి కార్మికుడు తాటికొండ సంజీవ్(30) ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. ఈనెల 23న సంజీవ్ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. సంజీవ్‌కు ఆరునెలల క్రితం ములుగుకు చెందిన అమ్మాయితో వివాహం కాగా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడిగా ఉంటున్నారు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ సుగుణాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు గాయపడ్డారు. మల్యాలపల్లెకు చెందిన పానుగంటి లక్ష్మీనారాయణ, చైతన్యపురి కాలనీకి చెందిన వొడిచెల పోచం ప్లాంటులో విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో కాల్వ నవీన్ పెద్దపల్లి నుంచి గోదావరిఖని వైపు కారులో వస్తూ బైక్‌ను ఢీకొన్నాడు. గాయపడిన ఇద్దరిని ఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.